సాక్షి
సంగారెడ్డి

సోమవారం । 19 । జూన్ । 2023



ఆదాయానికి గండి

మున్సిపాలిటీల్లో వ్యాపార అనుమతుల జారీపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఆదాయానికి భారీగా గండి పడుతోంది. IIలో



దాహార్తిని తీరుస్తున్న 'మిషన్ భగీరథ'

ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ రక్షిత తాగునీటి అందిస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. IIIలో

అందరికీ నెగెటివ్




పటాన్‌చెరు టౌన్: పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని టెస్టులు చేసిన నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయలేదన్నారు.

న్యూస్‌రీల్

విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లా వ్యాప్తంగా విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న విద్యా దినోత్సవ ఏర్పాట్లు, చేయాల్సిన కార్యక్రమాలపై అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, విద్యాశాఖ అనుబంధ శాఖల అధికారులు తదితరులతో కలెక్టర్ ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాదినోత్సవాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలన్నారు. పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమం విద్యా దినోత్సవం నాడు ప్రారంభమవుతుందన్నారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను, ఎంపిక చేసిన ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను సన్మానించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేతకిలో పోటెత్తిన భక్తజనం



కేతకిలో పూజలు చేసిన నీలం మధు, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. భక్తులు ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి, జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలో కొలువైన పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. అదే విధంగా భక్తులు స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన, అర్చన, హారతి, వాహన పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని చిట్కుల్ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. భక్తులు ఆలయ ఆవరణలోని బలభీముడి ఆలయం, బసవణ్ణ మందిరం, నాగుల కట్ట, నవగ్రహాలు తదితర ఆలయాల వద్ద పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ శశిధర్, చైర్మన్ నీలవెంకటేశం, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు హరితోత్సవం

సంగారెడ్డి టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నర్సరీలను సందర్శిస్తారని, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలలో మొక్కలు నాటుతారని పేర్కొన్నారు. పచ్చదనం పెంచడం కోసం చేస్తున్న కృషిని ప్రజలకు తెలియజేస్తారన్నారు.

ఘనంగా మంచి నీళ్ల పండగ

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ మంచి నీటిని అందించిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చిట్కుల్ గ్రామ పరిధి వడ్డెర కాలనీలో మంచినీటి దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రజల కోసం మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు అందిస్తున్నారన్నారు. తెలంగాణకు జాతీయస్థాయిలో 2023 సంవత్సరానికి నేషనల్ వాటర్ అవార్డు వచ్చిందని గుర్తు చేశారు. బీపీఎల్ కుటుంబాలకు రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కవిత, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు దుర్గయ్య, కృష్ణ,వెంకటేశ్, భుజంగం, మురళీ, వెంకటేష్, రాజ్ కుమార్, ఆంజనేయులు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు వెంకటేష్, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు కేసీఆర్

- రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తున్న మహానేత
- దేశానికి ఆదర్శం మిషన్ భగీరథ
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, పద్మాదేవేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తున్న సీఎం కేసీఆర్ అపర భగీరథుడని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా హత్నూర మండలం బోర్పట్ల శివారులోని మిషన్ భగీరథ పంప్ హౌస్ ఆవరణలో మంచినీళ్ల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు నీటి సమస్యతో అల్లాడుతుండటంతో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ పట్టుదలతో ముందుకు సాగారన్నారు. అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకమన్నారు. రాష్ట్రంలో 23,839 గ్రామాలు, 121 మున్సిపాలిటీల్లోని ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేడన్నారు. మిషన్ భగీరథ అమలు తీరును చూసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించారని గుర్తు చేశారు. మిషన్ భగీరథ పథకానికి ఆరు అవార్డులు వచ్చాయని మిషన్ భగీరథ రాష్ట్ర సలహాదారు నర్సింగ్ రావు తెలిపారు.

రాష్ట్ర పథకాలు దేశానికి ఆదర్శం

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నాయని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో రాష్ట్ర అతవరణ దశాబ్ది ఉత్సవాలు పండగ వాతావరణంలో జరుగుతున్నాయన్నారు.

భవిష్యత్ తరాల కోసం..

సీఎం కేసీఆర్ భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా, దేశం తెలంగాణ వైపు చూసే విధంగా పక్కా ప్రణాళికతో శాశ్వత కార్యక్రమాలు చేపడుతన్నారని నర్సాపూర్ శాసనసభ్యుడు మదన్ రెడ్డి అన్నారు. అంతకుముందు వాటర్ బెడ్‌లో జల శుద్ధీకరణ జరుగుతున్న తీరును మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మా రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా తదితర ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

గడపగడపకు తాగునీరు..

గడపగడపకు శుద్ధిచేసిన జలాలు అందిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని ముఖ్యమంత్రి కాపాడుతున్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కమలాకర్, ప్రవీణ్ కుమార్ బోర్పట్ల సర్పంచ్ అంజమ్మ, ఎంపీపీ అధ్యక్షుడు వావిలాల నరసింహులు, రైతుబంధు మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, నర్సాపూర్ ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఎంపీపీలు నర్సింహులు పాల్గొన్నారు.

ప్రపంచానికి విశ్వగురువుగా మోడీ

కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల



ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల

పటాన్‌చెరు టౌన్: ప్రపంచానికి విశ్వగురువుగా ప్రధాని మోడీ మారారని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ బహిరంగ సభకు హాజరై మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనపై చర్చ జరుగుతోందన్నారు. గత ప్రభుత్వాలు పాలనతో ఢిల్లీలో నిధులు విడుదల చేస్తే గ్రామాలకు సక్రమంగా చేరేవికావని, ప్రస్తుతం అందుతున్నాయన్నారు. సర్పంచ్‌లు అభివృద్ధి నిధుల కోసం ఎమ్మెల్యేలను అడగకుండా కేంద్రం నేరుగా అందిస్తోందనన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనన్నారు. బహిరంగ సభలో పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి బాబు మోహన్, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి జయశ్రీ, సహ ఇన్‌చార్జి అట్లూరి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మోహన్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంబాబు గౌడ్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, కో-కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజు గోపాల్ యాదవ్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్ వీక్షించి..

జహీరాబాద్: కేంద్ర మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల జహీరాబాద్‌లో విస్తృతంగా పర్యటించారు. ఆదివారం నిర్వహించిన పార్లమెంట్ స్థాయి మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పలువురి ఇళ్ల వెళ్లి వారి ఆతిథ్యం స్వీకరించారు. అంతకు ముందు బీజేపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్చన సారడా ఇంటికి వెళ్లి, వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. అక్కడ ప్రయాణీకుల వసతులను పరిశీలించారు. రైళ్ల నిర్వహణ విషయమై స్టేషన్ మాస్టర్ మాధవకృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రయాణీకులతో రైళ్ల సమాచారం, స్టేషన్ నిర్వహణపై ఆరా తీశారు.

మహిళల నీటి కష్టాలు తీరాయి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

మునిపల్లి(అందోల్): మిషన్ భగీరథతో మహిళల నీటి కష్టాలు తీరాయని జెడ్పీచైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని బుస్సారెడ్డిపల్లి గ్రామ శివారులో మిషన్ భగీరథ పంప్ హౌస్ వద్ద మంచినీళ పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల నీటి కష్టాలను తీర్చడానికే తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ చేపట్టి శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేస్తోందన్నారు. ఇంటింటికీ మంజీర నీరు ఏ విధంగా సరఫరా చేస్తోంది కలెక్టర్ శరత్ వివరించారు. రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అపర భగీరథుడు కేసీఆర్ ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చాడని కొనియాడారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ ప్రజలకు ఫ్లోరైడ్ లేని నీటిని అందించాలన్న సీఎం సంకల్పంతో మిషన్ భగీరథ నీళ్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న శశికుమార్, ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, డీఈలు ఏఈ, జిల్లా అధికారులు, డీఆర్‌ఓ, ప్రజా ప్రతినిధులు, డీసీసీబీవైస్ చైర్మెన్ మాణిక్యం, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, పోలీస్ అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీటీ సీలు, సర్పంచ్‌లు, తహసీల్దార్ శివకుమార్, ఎంపీడీఓలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



మునిపల్లి(అందోల్): మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): ప్రజలు ఆరోగ్యంగా ఉండా లనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ మిషన్ భగీరథద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం మండలంలోని బుస్సారెడ్డిపల్లి శివారులో మిషన్ భగీరథ పంప్‌హౌస్ వద్ద రాష్ట్ర అవతర ణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల పండగను సర్పంచ్ మంతూరి స్వప్న శశికుమార్, ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, మిషన్ భగీరథ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాకే గోదావరి, సింగూర్ ప్రాజెక్టు, మంజీర నుంచి మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు.

స్వరాష్ట్రంలో తొలగిన ఇబ్బందులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: గత ప్రభుత్వాల పాలనలో బిందెడు నీళ్ల కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితుల నుంచి పొయ్యి దగ్గరకే మంచి నీళ్లు అందించిన మహా నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఆదివారం మంచి నీళ్ల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి పటాన్‌చెరు నియోజకవర్గంలో 10 వేల నల్లా కనెక్షన్లు ఉంటే నేడు 40 వేలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ శ్రీశైలం, ఉప సర్పంచ్ శోభ, ఎంపీడీఓ బన్సీలాల్, గ్రామీణ నీటిపారుదల విభాగం డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు



సదాశివపేటలో మహిళల నీటి బిందెల ర్యాలీ

సదాశివపేట(సంగారెడ్డి): మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటిని అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కిందని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సదాశివపేటలో మున్సిపల్ కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఊరూరా మంచినీళ్ల పండగ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నీటి బిందెల ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, ఇంజనీర్ రాజేష్, కౌన్సిలర్ వడ్ల మహేశ్వరీ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీలమల్లన్న, ప్రధాన కార్యదర్శి విరేశం, పురపాలక సిబ్బంది మెప్మా తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు



దినేష్ కార్తీక్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

జహీరాబాద్ టౌన్: జేఈఈ అడ్వాన్స్‌లో గురుకులాల గిరిజన విద్యార్థులు సత్తా చాటారు. మొగుడంపల్లి మండలం పడియాల్ తండాకు చెందిన దినేష్ కార్తీక్ చౌహన్, మండలంలోని అల్గోల్ మైనార్టీ గురుకుల విద్యార్థి విజయ్ చౌహన్ ఆలిండియా ర్యాంక్ సాధించారు. దినేష్ కార్తీక్ 99 మార్కులతో 191 స్టేట్ ర్యాంక్ సాధించాడు. అలాగే అల్గోల్ తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో చదువుతున్న విజయ్ చౌహన్ 1411 ర్యాంక్ సాధించాడు. రీజినల్ లెవల్ కోఆర్డినేటర్(ఆర్ఎల్‌సీ) డాక్టర్ నరసింహ, ప్రిన్సిపాల్ జమీల్ విజయ్ చౌహన్‌ను అభినందించారు.

తాగునీరు అందించాలని ఆందోళన

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇంద్రకరణ్‌లో త్రాగునీరు సరఫరా చేయాలని గ్రామస్తులు ఖాళీబిందెలతో ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర మంతా నీటి పండగ చేసుకుంటున్నా, తమగ్రామంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నీటి సరఫరా క్రమం తప్పకుండా జరిగేలా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



● పచ్చగా ఉండాలని..



వర్షాకాలం ప్రారంభమైనా ఇంకా ఉష్ణోగ్రతలు తగ్గటం లేదు. సంగారెడ్డి నుంచి సదాశివపేట మార్గంలోని డివైడర్ మధ్యలో నాటిన మొక్కలు వాడిపోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మొక్కలు ఎండిపోకుండా ఇలా ట్యాంకర్ ద్వారా నీళ్లు పోస్తున్నారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

అందరి చూపు ఆకాశం వైపే!


- సీజన్ ప్రారంభమై 16 రోజులైనా చుక్కపడలే
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- జిల్లాలో 7.40 లక్షల ఎకరాల విస్తీర్ణం
- వెలవెల బోతున్న ఫర్టిలైజర్ షాపులు



నేలను సిద్ధం చేసుకున్న దృశ్యం

సంగారెడ్డి: వానా కాలం సీజన్ ప్రారంభమై 16 రోజులు కావస్తున్నా తొలకరి చినుకుల జాడ లేకపోవడంతో రైతన్నల చూపంతా ఆకాశం వైపే ఉంది. వానాకాలం సీజన్ మొదలైందంటే చాలు అన్నదాతల్లో ఎక్కడా లేని ఆనందం కనిపిస్తుండేది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ సమయంలో తొలకరి చినుకులు కురవాల్సి ఉన్నా కనీసం తుంపర్లు కూడా కురియకపోవడం వారిని ఆందోళనకు గురిచేస్తుంది. మే 25న రోహిణి కార్తెతో రైతులు విత్తనాలు వేయడం ఆనవాయితీగా వస్తుంది.

వర్షం పడుతుందేమోనని..



వర్షం కురుస్తుందన్న నమ్మకంతో రోజూ ఎదురుచూస్తున్నా. దానంపల్లి శివారులోని 4 ఎకరాల్లో పత్తి విత్తనాలు చల్లాను. వర్షం కురియకపోవడంతో ఎండతీవ్రతకు ఆ విత్తనాలు కూడా మొలకెత్తే పరిస్థితి కనిపించడంలేదు. వర్షం కురుస్తుందనుకున్నా, ఈ సంవత్సరమే వర్షాలు ఆలస్యమయ్యాయి. వర్షం కురియకపోవడంతో ఏం చేయాలో తోచడంలేదు. వర్షాలు ఎప్పుడు కురుస్తాయని అధికారులను అడుగుతున్నాం. వారం రోజుల్లో వర్షాలు కురియకపోతే నేను వేసిన విత్తనాలు మొలకెత్తకపోగా, రూ.పది వేల వరకు నష్టపోవాల్సిందే.

– నాగభూషణం, రైతు, దానంపల్లి

జాడలేని చినుకు..



కిచ్చన్నపల్లిలో పొలంలో కూర్చొని ఆకాశం వైపు చూస్తున్న రైతు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు వర్షాలు కురియలేదు. ఈ సమయంలో ఎక్కువగా జొన్న, బీపీటీ వరి, కంది, పత్తి తదితర పంటలు సాగుచేస్తారు.
- ప్రస్తుతం వానాకాలం ప్రారంభమై 16 రోజులు గడుస్తున్నా తొలకరి వర్షాలు లేక పంటలు సాగు చేసేదెలా అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.
- బోరు బావుల కింద కొంత మంది రైతులు విత్తనాలు వేయగా, వర్షాలు కురియ కపోవడం, ఎండవేడిమి కారణంగా అవి మొలకెత్తలేదు.
- రోహిణి కార్తె తర్వాత మృగశిర కార్తె కూడా వచ్చింది. ఇదీ మరికొన్ని రోజుల్లో ముగియనుంది.
- ఈ కార్తెల్లో విత్తనాలను చల్లుకుంటేనే మంచి దిగుబడులు వస్తాయని రైతుల విశ్వాసం. జిల్లావ్యాప్తంగా దాదాపు 7.40 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తారు. జిల్లాలో ఎక్కువగా మొక్కజొన్న, వరి, పత్తి పంటలు సాగవుతాయి.

గిరాకీ లేక..

- వానాకాలం మొదలయ్యిందో లేదో రైతులు ముందుగా భూములు చదును చేసుకోవడం, విత్తనాలు నాటడం, ఎరువులను కొనుగోలు చేయడం జరుగుతుంది.
- అలాంటి ఈసారి సీజన్ ప్రారంభమై 16 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు వ్యవసాయ పనులు ప్రారంభం కాకపోవడంతో ఎరువుల విక్రయాలు కూడా జరగడంలేదు.
- ఈ సీజన్‌లో ఫర్టిలైజర్ షాపులు రాత్రి వరకు తెరచి ఉండేవి. జోగిపేటలో గిరాకీలు లేక మూడు దుకాణాలు మూసివేసుకోగా, తెరచి ఉన్న షాపు వెలవెల బోతుంది.
- గిరాకీలు లేక ఖాళీగా ఉంటున్నామని దుకాణదారులు అంటున్నారు. రైతులు ఎరువు సంచులను ముందుగానే గ్రామాలకు తరలించి ఇళ్లల్లో నిల్వ ఉంచుకునే వారు.

క్లుప్తంగా

కృత్రిమ ఇసుక తయారీ
రెండు లారీల సీజ్



రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక లారీలు

సంగారెడ్డి : మండల పరిధిలోని బ్యాతోల్, ఎర్దనూర్ శివారుల్లో కృత్రిమ ఇసుక తరలిస్తున్న రెండు లారీలను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు గిర్దావర్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎర్దనూర్, బ్యాతోల్ శివారుల్లో కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ఫిల్టర్లపై దాడి చేసి ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని సీజ్ చేశారు. పట్టుకున్న లారీలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. కృత్రిమ ఇసుక తయారు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ విజయలక్ష్మి హెచ్చరించారు.

సెల్ మిస్సింగ్‌కు 'సీఈఐఆర్'తో చెక్



బాధితుడికి సెల్ ఫోన్ అందజేస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

చేర్యాల (సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్‌ను 'సీఈఐఆర్' టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు సీఐ పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ''పట్టణ కేంద్రానికి చెందిన బస్వరాజు వెంకటేష్ తన సెల్ ఈనెల 14న పోగొట్టుకున్నాడు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన www.ceir.gov.in అనే వెబ్‌సైట్‌లో సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేశాడు. సెల్ దొరికిన వ్యక్తి తన ఫోన్‌లో సిమ్‌కార్డు వేయగానే వెబ్‌సైట్ ద్వారా అతడి వివరాలు స్థానిక పోలీసులకు చేరాయి. వెంటనే అతడి నుంచి సెల్ స్వాధీనం చేసుకుని, బాధితుడికి అప్పగించాం'' అని సీఐ తెలిపారు.

ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం
జహీరాబాద్‌టౌన్: పట్టణంలోని సిద్ధ క్లినిక్‌లో ఆదివారం ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. మోకాలు, వెన్ను, మెడ, భుజం నొప్పులతో బాధపడుతున్న 150 మంది రోగులకు డాక్టర్లు దీప బలోడే, సంతోష్ బలోడెలు పరీక్షలు నిర్వహించారు. 4500 విలువ చేసే బీడీఎం పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది.

అతివేగానికి నిండు ప్రాణం బలి
కోహెడ రూరల్ (హుస్నాబాద్): అతివేగం, అజాగ్రత్తతో బైక్ నడపడంతో అదుపుతప్పి వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని విజంపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పర్లపల్లి రాజు (33), వేరొకరి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. బైక్‌ను అతివేగం, అజాగ్రత్తగా నడపడంతో ఇంటి సమీపంలో గోడకు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్రగాయాలై ఘటనా స్థలం వద్దే మరణించాడు. భార్య పర్లపల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీస్ కేసు నమోదైంది.

ఆదాయానికి గండి

- మున్సిపాలిటీల్లో పెరుగుతున్న దుకాణాలు
- ట్రేడ్ లైసెన్స్‌లపై దృష్టి సారించని అధికారులు
- వ్యాపారులకు అవగాహన కల్పించని వైనం
- రెన్యూవల్ చేయకుంటే భారీ వడ్డన



సదాశివపేటపట్టణంలో శాస్త్రిరోడ్డులో ఇరువైపులా దుకాణాలు

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపాలిటీల్లో వ్యాపార అనుమతులు (ట్రేడ్ లైసెన్సులు) జారీపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో మున్సిపాలిటీల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. వ్యాపార, వాణిజ్య సంస్థలన్నింటికీ ప్రభుత్వం ట్రేడ్ లైసెన్స్ తప్పని సరిచేసింది. ఇంత వరకు అవసరమైన దుకాణాదారులు మాత్రమే అనుమతి పత్రం తీసుకునేందుకు ముందుకొచ్చేవారు. లైసెన్స్‌ల జారీలో నిర్లక్ష్యం, అరకొర ఆన్‌లైన్ విధానంతో ఆదాయ లక్ష్యం నీరుగారుతుంది.

- జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల్లో 11,060 ట్రేడ్ లైసెన్స్‌డ్ దుకాణాలు ఉన్నాయి. అనధికారికంగా సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, అందోల్–జోగిపేట, బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్, నారాయణఖేడ్ మున్సిపాలిటీల్లో 2 వేల నుంచి 5 వేల వరకు ఉంటాయని అంచనా.
- లక్షలాది రూపాయల ఆదాయం రావాల్సి ఉన్నా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో గండిపడుతోంది. ట్రేడ్ లైసెన్సుల ద్వారా జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీలకు గతంలో రూ.2 కోట్ల ఆదాయం వచ్చేది.
- కొత్త నిబంధనల ప్రకారం రూ.3 కోట్లకు పెరగాలి. 11,060 ట్రేడ్ లైసెన్సుల్లో ఇప్పటి వరకు 2600 దుకాణాలకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులు రెన్యూవల్ చేసుకున్నారు. 8,455 మంది రెన్యూవల్ చేసుకోలేదు. దీంతో భారీగా పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది.
- దీనిపై మున్సిపల్ అధికారులు వ్యాపారులకు అవగాహన కల్పించలేదు. కొత్త ట్రేడ్ లైసెన్సు విధానంలో ఇప్పటికే అనుమతి విలువలో 25 శాతం అపరాధ రసుము కట్టాల్సి ఉంది.
- రెన్యూవల్ చేసుకోకపోతే జూన్ 1వ తేదీ నుంచి అది 50 శాతానికి పెరిగింది. లైసెన్స్‌ల రుసుము ఎక్కువగా ఉండటంతో మున్సిపల్ అధికారులు, వ్యాపారులతో కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మున్సిపాలిటీల్లో పెరుగుతున్న దుకాణాలు

- పట్టణాల విస్తీర్ణంతో పాటు కొత్తగా ఏర్పడుతున్న కాలనీలతో దుకాణాల సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు మున్సిపాలిటీల్లో రహదారులు, ప్రధాన రహదారులు, బస్టాండ్లు, కూడళ్లకే పరిమితమైన వ్యాపార సంస్థలు, దుకాణాలు అందుబాటులోకి వస్తున్నాయి.
- దీంతో ఆ స్థాయిలో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, కనీస అవసరాలు, కల్పించాల్సిన బాధ్యత మున్సిపాలిటీలపై పడింది. ఈ భారాన్ని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.
- ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్సు జారీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ విషయంలో సంబంధిత అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా చర్యలు



పట్టణంలో దుకాణ సముదాయాలు చాలా ఉన్నాయి. ఇంకా వందలాది మంది అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో దుకాణదారులు ట్రేడ్ లైసెన్సు తీసుకునేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు లైసెన్స్ తీసుకోని వారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేస్తాం. కొత్త నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తీసుకుని మున్సిపాలిటీ ఆదాయం పెంపునకు సహకరించాలి. గతంలో ట్రేడ్ లైసెన్స్ డిమాండ్ రూ.8.50 లక్షలు మాత్రమే ఉండేది. కొత్త విధానంలో అనుమతులు తీసుకుంటే రూ.22 లక్షలకు పైగా అదాయం వస్తుందని అంచనా.
– ఎస్. కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సదాశివపేట

ఇంటి యజమాని నిరాకరించడంతో..



రోడ్డుపక్కన టెంటు వేసి లచ్చయ్య పార్థివదేహాన్ని ఉంచిన దృశ్యం

చేగుంట(తూప్రాన్): అద్దె ఇంటి యజమాని ఇంట్లో శవం వేయరాదని నిరాకరించడంతో రోడ్డు పక్కనే ఉంచి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ హృదయ విదారక ఘటన చేగుంటలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మంద లచ్చయ్య (45), భాగ్యమ్మ దంపతులు. అద్దె ఇంట్లో ఉంటూ రోడ్డు పక్కన మక్క బుట్టలు అమ్ముకొని జీవిస్తుంటారు. ఇటీవల లచ్చయ్య అనారోగ్యానికి గురి కాగా సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని తమ ఇంట్లోకి తీసుకురావద్దని ఇంటి యజమాని సూచించాడు. దీంతో మృతదేహాన్ని శ్మశాన వాటిక సమీపంలో జాతీయ రహదారి పక్కన టెంటు కింద ఉంచి, అంత్యక్రియలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు పేర్కొన్నారు. మృతుడి అంత్యక్రియల కోసం 5 వేల ఆర్థిక సాయాన్ని టెంట్ రాజు అందించారు.

భార్య తలుపు తీయలేదని..



వడ్డే మల్లేశం (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): భార్య తలుపు తీయలేదని మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలప్‌చెడ్ మండలం గంగారం గ్రామానికి చెందిన వడ్డే మల్లేశం (27) రోజూ మద్యం తాగొచ్చి భార్య సరితతో గొడవ పడుతుండేవాడు. శనివారం రాత్రి 11.30 గంటలకు కూడా తాగినమైకంలో భార్యను తలుపుల తియమన్నాడు. సరిత భయపడి తలుపులు తీయలేదు. మనస్తాపం చెందిన మల్లేశం ఇంటిఎదురుగా ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అతడి తండ్రి పోచయ్య తెలిపాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మిస్బావుద్దీన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ చార్జింగ్ పెడుతుండగా విద్యుత్ షాక్



పర్శరాములు (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట) : సెల్‌చార్జింగ్ పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి సెక్యూరిటీ గార్డ్ మృతిచెందిన సంఘటన మండలంలోని గాగిల్లాపూర్ శివారులో గల కావేరి సీడ్స్ కంపెనీ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం తెల్లవారుజాము జరిగింది. భార్య లత ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. చిన్నకోడూర్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన మెట్ల పర్శరాములు(32) కావేరి సీడ్స్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. శనివారం నైట్ డ్యూటీకి వెళ్లాడు. ఆదివారం ఉదయం సెల్ చార్జింగ్ పెడుతూ విద్యుత్ షాక్‌కు గురై పెద్దగా కేకలు వేయగా, తోటి ఉద్యోగి తేరుకునేలోపు విగత జీవిగా పడి ఉన్నాడు. అతడి అరచేయికి గాయమైంది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ప్రవీణ్‌రాజ్ పరిశీలించారు. మృతుడి భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రుల చెంతకు..



పోలీసులతో అఖిల ఆమె తల్లిదండ్రులు

జిన్నారం(పటాన్‌చెరు): తప్పిపోయిన బాలికను తల్లిదండ్రుల వద్దకు పోలీసులు చేర్చారు. కొడకంచి గ్రామానికి చెందిన వీరేష్ కుమార్తె కొమ్ము అఖిల అనే బాలిక ఇంటి నుంచి వెళ్లింది.. ఎంతకీ తిరిగి రాలేదు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విజయారావు ఆధ్వర్యంలో విచారణ జరిపిన పోలీసులు దుండిగల్‌లోని ఓ ఆశ్రమంలో బాలికను గుర్తించారు. ఆదివారం ఎస్ఐ విజయారావు అఖిలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. ఈసందర్భంగా వీరేష్ దంపతులు పోలీసులకు కృతజ్ఞతలు చెప్పారు.

ట్రాక్టర్ పైనుంచి పడి రైతు మృతి



యాదవరెడ్డి(ఫైల్)

కంది(సంగారెడ్డి): ట్రాక్టర్ పైనుంచి పడి రైతు మృతి చెందిన సంఘటన కంది మండలంలోని ఎర్దనూర్‌లో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డికథనం ప్రకారం యాదవ రెడ్డి(60) తన పొలంలో మట్టిని తోలిస్తున్నాడు. ఈ క్రమంలో మట్టిని తీసుకెళుతుండగా ట్రాక్టర్ పైనుంచి యాదవరెడ్డి ప్రమాదవశాత్తు కిందపడి పోవడంతో చక్రాలు మీద నుంచి వెళ్లాయి. ఈప్రమాదంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. ఎస్సై శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత



నాగ్సాన్‌పల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదె కళేబరం

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలోని నాగ్సాన్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన ముండ్రాయి రాములు తన పశువులను రోజూ మాదిరిగా మేతకు తోలాడు. గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్ తగిలి గేదె మృత్యువాత పడింది.దీంతో రూ 80వేలకుపైగా నష్టం వచ్చినట్లు రాములు తెలిపారు.

పశువుల పాక, గడ్డివాము దగ్ధం



కాలిపోతున్న పశువులపాక

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుత్ తీగలు ఒకదానినొకటి తగిలి నిప్పురవ్వలు ఎగసిపడి పశువుల పాక, గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం మల్‌చెర్వుతండాలో చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మాలోతు మల్లునాయక్ అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో 2 విద్యుత్ తీగలు పరస్పరం తగిలి నిప్పురవ్వలు పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పశువుల పాక, మూడెకరాల్లో గడ్డివాము కాలి బుడిదయ్యాయి. రూ.60వేల వరకు నష్టం వాటిల్లినట్లు పలువురు రైతులు చెబుతున్నారు. లూజ్ వైర్లను సవరించాలని విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని గ్రామస్తులు, రైతులు వాపోయారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



నారాయణ మృతదేహం

టేక్మాల్(మెదక్): మంజీరనదిలో శనివారం గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఎలకుర్తి గ్రామంలో కందిపల్లి నారాయణ (50) వ్యవసాయంతోపాటు చేపలు పట్టి అమ్ముకుంటూ జీవిస్తుండేవాడు. రోజులాగే నారాయణ శనివారం చేపల వేటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి కోరంపల్లి గ్రామ శివారులోని మంజీరా నది వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు విడిచాడు. మృతుడి భార్య కందిపల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ తుక్కయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఏడుగురు అదృశ్యం

ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ కారణాలతో ఏడుగురు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, జిన్నారం, వర్గల్ పరిధిలో ఈ కేసులు నమోదు అయ్యాయి.

సెల్ తీసుకొని కూతురు పరార్



మౌనిక (ఫైల్)

పటాన్‌చెరు టౌన్ : తండ్రి ఫోన్ తీసుకుని కూతురు అదృశ్యమైన సంఘటన భానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం పోచమైలారానికి చెందిన పోచయ్య, లలిత దంపతుల కూతురు మౌనిక(20). ఆమె పదో తరగతితో చదువు ఆపేసి ఇంటి వద్దే ఉంటోంది. శనివారం అర్ధరాత్రి లలిత నీళ్ల తాగేందుకు లలిత లేవగా మౌనిక కూడా నిద్ర లేచి ఉంది. మరోసారి లలితకు మెళకువ రాగా భర్తను ఇప్పుడు టైం ఎంత అని అడిగింది. ఫోన్‌లో భర్త టైం చూసేందుకు యత్నించగా కనిపించలేదు. అర్ధరాత్రి ఒంటి సమయంలో మౌనిక ఫోన్ తీసుకొని ఇంటి నుండి వెళ్లిపోయిందని తల్లి పేర్కొంది. ఆమె కోసం తెలిసిన వారిని విచారించినా ఆచూకీ లభించలేదు. సెల్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చిందని తల్లి తెలిపింది. కూతురు అదృశ్యంపై లలిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని..



రీనా బేగం

సంగారెడ్డి టౌన్ : మైనర్ అదృశ్యమైన సంఘటనా సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోతిరెడ్డిపల్లిలోని విద్యానగర్ కాలనీలో నివసించే రీనాబేగం ఈనెల 16న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె తరచూ తన ఫోన్లో ఎక్కువగా మాట్లాడుతుందని తండ్రి మందలించాడనే కారణంతో బ్యాగు, సర్టిఫికెట్లు వెంట తీసుకొని ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. అదే విషయాన్ని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నాడు. రూరల్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె వివరాలు తెలిస్తే 8712656746, 8712656719 నంబర్లలో తెలపాలని విజ్ఞప్తి చేశారు.

తల్లీకొడుకులు...



యశోద, ఆమె కుమారులు (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తల్లీకొడుకులు అదృశ్యమైన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన యేసయ్య తన కుటుంబసభ్యులతో కలిసి జీవనోపాధి కోసం విద్యుత్ నగర్‌కు 4 రోజుల క్రితం వలసొచ్చాడు. కూలీ పనులు చేసుకుంటున్నారు. వీరి కుమారులు అఖిలేష్, పృధ్వీ స్థానిక పాఠశాలలో చదువుతున్నారు. శనివారం వారు పాఠశాలకు వెళ్లారు. వారిని స్కూల్ నుంచి తెచ్చేందుకు యశోద అదేరోజు సాయంత్రం ఇంటి నుంచి స్కూల్ వెళ్లింది. రాత్రి అయినా భార్య, ఇద్దరు కుమారులు ఇంటికి చేరలేదు. దీంతో యేసయ్య వారి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కూలీ పనులకు వెళ్లొచ్చే లోగా..



స్వాతి(ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): కూలీ పనులకు వెళ్లొచ్చే లోపు ఇంట్లో ఉన్న కుమార్తె అదృశ్యమైన సంఘటన గుమ్మడిదలలో జరిగింది. ఎస్ఐ విజయకృష్ణ కథనం ప్రకారం గుమ్మడిదల గ్రామానికి చెందిన జిన్నా లక్ష్మి, లక్ష్మయ్య దంపతులకు జిన్నా స్వాతి(16) అనే కూతురు ఉంది. శనివారం భార్యాభర్తలు కూలీ పనికి వెళ్లి సాయంత్రం వచ్చే సరికి ఇంట్లో స్వాతి కనిపించలేదు. స్నేహితులను విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆమె తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ విజయకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీ సొమ్ము విషయంలో గొడవ



బొమ్మ మల్లేశం(ఫైల్)

వర్గల్ (గజ్వేల్): చిట్టీ డబ్బుల విషయంలో దంపతుల మధ్య గొడవ కారణంగా భర్త మనస్థాపానికి గురై కనిపించకుండా పోయిన సంఘటన రామక్కపేటలో జరిగింది. గౌరారం ఎస్సై సంపత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రామక్కపేటకు చెందిన బొమ్మ మల్లేశం(36) డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 16న శుక్రవారం రాత్రి చిట్టీ డబ్బుల విషయంలో మల్లేశం దంపతుల మధ్య గొడవపడ్డారు. శనివారం భార్య రజిత కూలీ పనులకు వెళ్లగా ఆ సమయంలో భర్త, పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం ఆమె ఇంటికి తిరిగొచ్చే సరికి భర్త కనిపించలేదు. చుట్టుపక్కల వారిని, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకీ దొరకలేదు. దీంతో భార్య రజిత ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బొలేరో, బైక్ ఢీ.. వైద్యుడి దుర్మరణం



శ్రీకాంత్ మృతదేహం

అల్లాదుర్గం (మెదక్) : బొలేరో వాహనం బైక్‌ను ఢీకొనడంతో డాక్టర్ మృతిచెందిన సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చెవెళ్లలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం.. నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ కిషన్ నాయక్ తండాకు చెందిన శ్రీకాంత్(27) ఫిజియోథెరపీ డాక్టర్. చెవెళ్లలో ఓ వ్యక్తికి వైద్యం కోసం ఆదివారం వచ్చాడు. తిరుగు పయనంలో చెవెళ్ల శివారులో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం శ్రీకాంత్ నడుపుతున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీకాంత్‌ను జోగిపేటకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడి తండ్రి కిషన్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరు చైన్ స్నాచర్‌ల అరెస్ట్

పోతిరెడ్డిపల్లి, గజ్వేల్‌లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి డీఎస్పీ రవీందర్ రెడ్డి, గజ్వేల్ సీఐ వీరప్రసాద్ కేసు వివరాలను వెల్లడించారు. వారి కథనం ప్రకారం..



నిందితుడు చాకలి అశోక్

సంగారెడ్డి టౌన్ : కళ్లల్లో కారం చల్లి బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లిన దొంగను పోలీసులు పట్టుకొని, సొత్తును రికవరీ చేసుకొని రిమాండ్ తరలించారు. పోతిరెడ్డిపల్లిలోని శిల్పావెంచర్‌లో కిరాణా షాప్ నిర్వాహకురాలు సరిత మెడలో నుంచి బంగారు పుస్తెల తాడు తెంపుకెళ్లిన చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు పరిష్కరించేందుకు డీఎస్పీ, ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అందోల్ మండలం డాకూర్ గ్రామానికి చెందిన చాకలి అశోక్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లుగా ఒప్పుకున్నాడు. ఆదివారం అతడిని రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన సంగారెడ్డి రూరల్ పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

24 గంటల్లోనే పట్టివేత



చోరీ కేసు వివరాలను వెల్లడిస్తున్న గజ్వేల్ సీఐ వీరప్రసాద్

గజ్వేల్‌రూరల్: ఓ వృద్ధురాలి మెడలోంచి బంగారు గొలుసు తెంపుకెళ్లిన చైన్ స్నాచర్‌ను గజ్వేల్ పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేశారు. ప్రశాంత్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు ఐననూతి వెంకటలక్ష్మి శనివారం పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో వృద్ధాప్య పెన్షన్ తీసుకునేందుకు వెళ్లగా, జార్ఖండ్‌కు చెందిన గంగా కుమార్రాయ్ గొలుసును తెంపుకెళ్లడం తెలిసిందే. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 4 తులాల బంగారు గొలుసును రికవరీ చేశారు. అతడిని రిమాండ్‌కు తరలించామని గజ్వేల్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. 24 గంటల్లో కేసును ఛేదించామమని పేర్కొన్నారు. గజ్వేల్ సీఐ వీరప్రసాద్, ఎస్ఐ నరేష్, కానిస్టేబుళ్లు సుభాష్, యాదగిరి, వెంకటేష్, రవిలను గజ్వేల్ ఏసీపీ రమేష్ అభినందించారు.

మద్యంమత్తులో స్నానానికి వెళ్లి..

పటాన్‌చెరు టౌన్ : మద్యంమత్తులో పటేల్ గూడా గ్రామ శివారులోని ఊభకుంట చెరువులో స్నానానికి దిగి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన పోసు చంద్రశేఖర్(23) స్విగ్గి , జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తుండేవాడు. చంద్రశేఖర్ మద్యానికి బానిసై రోజూ తాగేవాడు. ఆదివారం పటేల్ గూడా గ్రామ శివారులోని ఊభకుంట చెరువులో చంద్రశేఖర్ మృతదేహం బయటపడింది. చెరువు గట్టున అతడి వస్తువులున్నాయి. స్థానికులు నుంచి సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుస్పత్రికి తరలించారు. మద్యంమత్తులో స్నానానికెళ్లి నీటిలో పడి మృతిచెంది ఉండొచ్చని అతడి బంధువు లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో బలవన్మరణం

నంగునూరు(సిద్దిపేట) : తాగుడుకు బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాంపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోదాసు ఎల్లం మద్యానికి బానిసగా మారడంతో మూడేళ్ల క్రితం అతడిని వదిలి భార్య పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉంటున్న బోదాసు జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రజిత ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజుగౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.